
సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 21 । మే । 2023



12,368 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 12,368 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.60 అడుగులుగా ఉంది.



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో సుదర్శన హోమానికి కడియం ఉపేంద్రరావు, నాగ రేణుక దంపతులు (తణుకు) రూ.లక్ష విరాళం సమర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
41.0°/26°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	41.0	26.0
కాకినాడ	38.6	28.3
అమలాపురం	38.1	27.0

న్యూస్‌రీల్

శైవాగమ సంప్రదాయంతో సనాతన ధర్మపరిరక్షణ



ముక్కామలలో శైవాగమ పాఠశాలను ప్రారంభిస్తున్న అర్చక బృందం

అంబాజీపేట: శైవాగమ సంప్రదాయంతోనే సనాతన ధర్మ పరిరక్షణ సాధ్యమని వక్కలంకకు చెందిన శ్రీవాసుదేవానంద భారతీ స్వామీజీ అన్నారు. కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ అనుజ్ఞ మేరకు ముక్కామలలో శైవాగమ పాఠశాలను శనివారం ఏర్పాటు చేశారు. దీనిని ముక్కామల శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత రాఘవేశ్వరస్వామి ఆలయ అర్చకుడు వెలవలపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి స్వగృహంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసుదేవానంద భారతీ స్వామీజీ, సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ శైవాగమ పాఠశాల ఏర్పాటుతో సనాతన ధర్మరక్షణతో పాటు అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. పాఠశాల అధ్యాపకుడిగా మందపల్లికి చెందిన అయలూరి రామలింగశాస్త్రిని స్వామీజీ ఆదేశాల మేరకు నియమించామని అన్నారు. పాఠశాల అభివృద్ధికి నూతన కమిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు. గౌరవాధ్యక్షునిగా వెలవలపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి, గౌరవ సలహాదారుగా పుల్లేటికుర్తి సత్యనారాయణ శాస్త్రి, అధ్యక్షునిగా వెలవలపల్లి చంద్రశేఖరశర్మ, సభ్యులుగా కొత్తపల్లి విజయభాస్కరశర్మ, యలమంచిలి సుబ్రహ్మణ్య శాస్త్రి, పూజ్యం శ్రీనివాసరావుతో పాటు మరో ఐదుగురు నియమితులయ్యారు.

కిటకిటలాడిన బాలబాలాజీ స్వామి ఆలయం



బాలబాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఉభయ దేవేరులతో కొలువు దీరిన బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. ఈ ఒక్కరోజే స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2.46 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదాలు, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1.65 లక్షలు వచ్చింది. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.80,638 విరాళాలుగా సమర్పించారు. 3,269 మంది స్వామి వారిని దర్శించుకుని, 2,518 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ఈఓ డి.శ్రీరామ వరప్రసాదరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రత్నగిరి.. భక్తజనఝరి

అన్నవరం: విద్యా సంస్థలకు వేసవి సెలవులకు తోడు శనివారం పర్వదినం కావడంతో రత్నగిరికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడం మొదలైంది. సత్యదేవుని సుమారు 40 వేల మంది దర్శించి, పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు 2,500 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, ప్రదక్షిణలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు.

ఘనంగా ప్రాకార సేవ

సత్యదేవుని ప్రాకార సేవను ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని తిరుచ్చి వాహనంపై వేంచేయించి, తూర్పు రాజగోపురం వద్ద ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు.

మేమే నంబర్ 1

- పాలిసెట్‌లో టాప్ లేపారు
- ఉమ్మడి 'తూర్పు' విద్యార్థులకు ర్యాంకుల పంట
- పలువురికి స్టేట్ ఫస్ట్ ర్యాంకులు

ఉమ్మడి జిల్లాలో పాలిసెట్ ఫలితాలు

కాకినాడ జిల్లా

పరీక్ష రాసిన బాలురు :	5,421
బాలికలు :	3,450
మొత్తం :	8,871
ఉత్తీర్ణులైన బాలురు :	4,461 (82.29 శాతం)
బాలికలు :	3,010 (87.25 శాతం)
మొత్తం :	7,471
మొత్తం ఉత్తీర్ణత శాతం :	84.22

తూర్పు గోదావరి జిల్లా

పరీక్ష రాసిన బాలురు :	3,117
బాలికలు :	1,777
మొత్తం :	4,894
ఉత్తీర్ణులైన బాలురు :	2,653 (85.11 శాతం)
బాలికలు :	1,590 (89.48 శాతం)
మొత్తం :	4,243
మొత్తం ఉత్తీర్ణత శాతం :	86.70

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

పరీక్ష రాసిన బాలురు :	2,857
బాలికలు :	1,809
మొత్తం :	4,666
ఉత్తీర్ణులైన బాలురు :	2,399 (83.97 శాతం)
బాలికలు :	1,591 (87.95 శాతం)
మొత్తం :	3,990
మొత్తం ఉత్తీర్ణత శాతం :	85.51

రాజమహేంద్రవరం రూరల్/బాలాజీచెరువు (కాకినాడ సిటీ)/తొండంగి/మండపేట/చాగల్లు: పాలిసెట్–2023లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విద్యార్థులు టాప్ లేపారు. పది మందికి పైగా రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకులను కైవసం చేసుకున్నారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈ నెల 10వ తేదీన ఈ పరీక్ష నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లాలో 14, కాకినాడ జిల్లాలో 28, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 19 కేంద్రాల్లో ఈ పరీక్ష కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ నిర్వహించారు. ఈ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. జూలై 1 నుంచి తరగతులు ప్రారంభిస్తున్న నేపథ్యంలో గత ఏడాది కంటే ఈసారి 20 రోజులు ముందుగానే ఫలితాలు విడుదల చేశారు. ఈ పరీక్షలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడం విశేషం. వారి వివరాలివిగో..



విద్యార్థి: వనపర్తి తేజశ్రీ
ర్యాంకు: 1
స్వస్థలం: స్వరూప్‌నగర్, లాలా చెరువు, రాజమహేంద్రవరం
తండ్రి: మల్లేశ్వరరావు, ఫైనాన్షియల్ అడ్వైజర్
తల్లి: లక్ష్మి, ప్రైవేటు ఉద్యోగి
విద్యార్థి లక్ష్యం: ముంబయి ఐఐటీలో సీటు



విద్యార్థి: కొంజర్ల శంకర్ మాణిక్
ర్యాంకు: 1
స్వస్థలం: శృంగవృక్షం, తొండంగి మండలం, కాకినాడ జిల్లా
తండ్రి: రమణ, ప్రభుత్వ టీచర్
తల్లి: దుర్గాదేవి, గృహిణి
విద్యార్థి లక్ష్యం: ముంబయి ఐఐటీ, కంప్యూటర్ ఇంజినీర్



విద్యార్థి: దుద్దుపూడి రూపిక
ర్యాంకు: 1
స్వస్థలం: కాతేరు, రాజమహేంద్రవరం రూరల్
తండ్రి: గోవిందు, పేపర్ మిల్లు ఉద్యోగి
తల్లి: పద్మావతి, గృహిణి
విద్యార్థి లక్ష్యం: ఐఐటీ, కంప్యూటర్ ఇంజినీర్



విద్యార్థి: దుర్వి ఆశిష్ సాయి శ్రీకర్
ర్యాంకు: 1
స్వస్థలం: రాజమహేంద్రవరం
తండ్రి: డాక్టర్ శ్యామ్‌కిరణ్, వైద్యుడు
తల్లి: డాక్టర్ పద్మజ, వైద్యురాలు
విద్యార్థి లక్ష్యం: సైంటిస్ట్



విద్యార్థి: ఉర్రింకల జితుకౌముది
ర్యాంకు: 1
స్వస్థలం: రాజమహేంద్రవరం
తండ్రి: సుబ్బారావు, మెకానికల్ ఇంజినీర్
తల్లి: అనురాధ, గృహిణి
విద్యార్థి లక్ష్యం: ఐఐటీలో సీఎస్ఈ సీటు



విద్యార్థి: శీలా గౌతమ్
ర్యాంకు: 1
స్వస్థలం: రాజమహేంద్రవరం
తండ్రి: అమరనాథ్, అకౌంటెంట్
తల్లి: స్వప్న, నర్స్
విద్యార్థి లక్ష్యం: ఐఐటీ, ఏరోనాటికల్ ఇంజినీర్



విద్యార్థి: పాల గేయశ్రీ సాయి హర్షిత్
ర్యాంకు: 1
స్వస్థలం: కాతేరు, రాజమహేంద్రవరం రూరల్
తండ్రి: రవికుమార్, ఫిలిం డిస్ట్రిబ్యూటర్
తల్లి: రజని, ప్రైవేట్ టీచర్
విద్యార్థి లక్ష్యం: ఐఐటీ, సైంటిస్టు



గోనెల్ల శ్రీరామ శశాంక్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు



విద్యార్థి: గ్రంధి గీతిక
ర్యాంకు: 1
స్వస్థలం: మల్లయ్యపేట, కాతేరు, రాజమహేంద్రవరం రూరల్
తండ్రి: గ్రంధి సురేష్, లెక్చరర్
తల్లి: లక్ష్మి, గృహిణి
విద్యార్థి లక్ష్యం: ఐఐటీ, ఐఏఎస్



విద్యార్థి: అగ్గాల కృష్ణసాహిత్
ర్యాంకు: 1
స్వస్థలం: రాజమహేంద్రవరం
తండ్రి: సతీష్‌కుమార్, బిజినెస్
తల్లి: రమ్య, టీచర్
విద్యార్థి లక్ష్యం: ఐఐటీ, సైంటిస్టు



విద్యార్థి: కప్పల వెంకట రామ వినీష్
ర్యాంకు: 1
స్వస్థలం: కోరుకొండ, తూర్పు గోదావరి జిల్లా
తండ్రి: కృష్ణకుమార్, బిజినెస్
తల్లి: ప్రవీణ లక్ష్మి, గృహిణి
విద్యార్థి లక్ష్యం: ఐఐటీ, కంప్యూటర్ ఇంజినీర్



విద్యార్థి: దొంగ శ్రీవెంకట శ్రవణ్
ర్యాంకు: 1
తండ్రి: త్రిమూర్తులు, ప్రభుత్వ టీచర్
తల్లి: సాయిసుధ, గృహిణి
విద్యార్థి లక్ష్యం: ఇంజినీర్

విద్యార్థి: గోనెల్ల శ్రీరామ్ శశాంక్
ర్యాంకు: 1
స్వస్థలం: కాకినాడ
తండ్రి: శ్రీధర్‌బాబు, చార్టర్డ్ అకౌంటెంట్
తల్లి: సూర్య సరోజ, గృహిణి
విద్యార్థి లక్ష్యం: ఐఐటీ



విద్యార్థి: కొడవటి మోహిత్ శ్రీరామ్
ర్యాంకు: 1
స్వస్థలం: చాగల్లు, తూర్పు గోదావరి జిల్లా
తండ్రి: సత్యనారాయణ, వ్యవసాయం
తల్లి: నవీన, గృహిణి
విద్యార్థి లక్ష్యం: డాక్టర్



విద్యార్థి: యర్రా లక్ష్మీకీర్తన
ర్యాంకు: 16
స్వస్థలం: వాకలపూడి, కాకినాడ
తండ్రి: ప్రసాద్, ప్రైవేటు ఉద్యోగి
తల్లి: భూలక్ష్మి, గృహిణి
విద్యార్థి లక్ష్యం: ఐఐటీ



కుటుంబ సభ్యులతో కొడవటి మోహిత్ శ్రీరామ్

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఎలాంటి లోపాలూ రానీయొద్దు
- కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి లోపాలు రానీయొద్దని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణపై శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జూన్ 1 వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ థియరీ పరీక్షలు రెండు సెషన్స్‌లో జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు రెండో ఏడాది విద్యార్థులకు పరీక్షలు ఉంటాయని వివరించారు. ఈ పరీక్షలను జిల్లాలోని 27 కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో వివిధ కారణాలతో హాజరు కాలేకపోయిన.. ఫెయిల్ అయిన విద్యార్థులకు జూన్ 2న ఎథిక్స్ పరీక్ష, 3న పర్యావరణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు రెండు సెషన్లలో రాజమహేంద్రవరం గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 5 నుంచి 9 వరకూ నిర్వహిస్తామన్నారు. రెండేళ్లు కలిపి మొత్తం 14,257 మంది విద్యార్థులు



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. జిల్లాలో ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లు, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లు తనిఖీలు చేస్తాయన్నారు. పరీక్షల పర్యవేక్షణకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ ఏర్పాటు చేశామన్నామన్నారు. రాజమహేంద్రవరం రీజినల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలిగినా కంట్రోల్ రూమ్ నంబర్ 0883–2473430కు కాల్ చేయవచ్చన్నారు. రాజమహేంద్రవరం గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అక్కడి నుంచి ప్రశ్నపత్రాలు షీల్డ్ కవర్లలో కోనసీమ జిల్లాలో ఏర్పాటు చేసిన 14 స్టోరేజ్ పాయింట్లకు పంపుతారని, పరీక్ష రోజున కేంద్రాలకు ప్రశ్నపత్రాలు తీసుకెళ్తారని తెలిపారు.

144 సెక్షన్ అమలు

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు అయ్యేలా చూడాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆయా మార్గాల్లో విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులను తరచూ నడపాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీధర్, జేసీ ధ్యానచంద్ర, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీఓ వసంతరాయుడు, ఆర్ఐఓ నరసింహం, డీవీఈఓ సత్యనారాయణ రెడ్డి, డీఈఓ కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన డేటా సేకరించాలి

అమలాపురం టౌన్: అభివృద్ధి లక్ష్యాల అమలు కోసం క్షేత్ర స్థాయిలో కచ్చితమైన డేటా సేకరించాలని, దానికి గ్రామ, వార్డు సచివాలయాల పాత్ర కీలకమని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. ముమ్మిడివరం అర్బన్, రూరల్ మండలాల గ్రామ వార్డు సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో స్థానిక కలెక్టరేట్‌లో శనివారం సమీక్ష సమావేశం జరిగింది. కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, దానిని చేరుకునేందుకు క్షేత్రస్థాయిలో కచ్చితమైన డేటా సేకరించాలన్నారు. జిల్లాను ఆరోగ్యవంతంగా మార్చేందుకు విద్య, ఆరోగ్యం, సంక్షేమ శాఖల మధ్య సమన్వయం అవసరమని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి భీమేశ్వర్, ముమ్మిడివరం ఎంపీడీఓ ఏఎస్ శ్రీనివాస్, నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలతో మేలు



జిన్నూరి బాబి

అమలాపురం టౌన్: సాగునీరు అందని ప్రాంతాల్లో వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలు వేస్తే మేలని రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి) అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి సాగునీటి వనరుల లభ్యత, ప్రత్యామ్నాయ పరిస్థితులపై రైతులకు సూచనలు చేశారన్నారు. వీటిని పాటిస్తే సాగునీటి సమస్య నుంచి బయట పడవచ్చని శనివారం అమలాపురంలో బాబి అన్నారు. అంబాజీపేట తదితర ప్రాంతాల్లో మెరక భూములుగా హైలెవెల్ ప్యాచెస్ ఎక్కువగా ఉండడంతో సాగునీరు ఎక్కకపోవడం, తద్వారా రైతులు ఇబ్బందులు పడుతున్న విషయంపై జిల్లా వ్యవసాయ మండలి సమావేశం చర్చించిందని అన్నారు. ఆయా ప్రాంతాల రైతులు సాగునీటి సమస్యల నుంచి బయటపడేందుకు వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటలను పండించాలని సూచించారు. తక్కువ నీటితో పండే మొక్కజొన్నను వేయవచ్చని అన్నారు. రైతుల ప్రయోజనాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ధవళేశ్వరం నుంచి ఇరిగేషన్ ఈఈ కార్యాలయాన్ని తరలించడంతో పాటు కాకినాడ నుంచి డ్రెయిన్స్ కార్యాలయాన్ని కూడా తీసుకొచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ముమ్మిడివరంలో ఏరువాక కేంద్రం ఏర్పాటైందని, కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని బాబి వివరించారు. కోనసీమలో శాశ్వత ప్రాతిపదికన వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం తీర్మానించి ప్రభుత్వానికి పంపడం శుభ పరిణామమన్నారు.

శ్రీనివాసా.. శ్రీవేంకటేశా..

వాడపల్లికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 40 వేల మంది తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. స్వామివారిని వేరుశెనగ కాయలు, వివిధ రకాల పుష్పాలతో అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యహవచనం తదితర పూజలు చేశారు. ఆలయ ఆవరణలో అన్న సమారాధన జరిగింది. ఈ ఒక్కరోజే ఆలయానికి స్వామివారి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ విక్రయాల ద్వారా రూ.16.69 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. అలాగే స్వామివారి ఆలయం గోపురం వద్ద విమాన వెంకన్న బాబును ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. స్వామివారి నిత్యాన్నదాన పథకానికి కడియం మండలం పొట్టిలంకకు చెందిన కె.రాజబాబు, సత్యవతి దంపతులు రూ.10,116, కేఎస్‌వీవీ ఎస్ఎన్ఎస్‌పీ రఘురామ్ రూ.10,116 విరాళంగా సమర్పించారు. దాతకు ఆలయ కమిటీ సభ్యులు పెన్మెత్స సురేష్‌రాజు చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

అమలాపురం రూరల్: జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి శనివారం నిర్వహించిన రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈఓ కమలకుమారి, ప్రవేశ పరీక్షల జిల్లా సమన్వయకర్త టి.నరసింహస్వామి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2023–24లో ప్రవేశానికి అమలాపురం భాష్యం ఇంగ్లిష్ మీడియం స్కూల్, చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లలో పరీక్షలు జరిగాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్షలు నిర్వహించామని వారు తెలిపారు. 5, 6, 7, 8 తరగతులకు 57 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 33 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. జూనియర్ కళాశాలలకు 490 మంది దరఖాస్తు చేసుకోగా 394 మంది, డిగ్రీలో ప్రవేశానికి 14 మందికి 11 పరీక్ష రాశారని డీఈఓ తెలిపారు. ప్రత్యేక వాహనం ద్వారా ఓఎంఆర్ జవాబు పత్రాలను గుంటూరుకు పంపుతున్నామని, త్వరలోనే ఫలితాలు వెల్లడిస్తామన్నారు.



అమలాపురంలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఈడీఓ కమలకుమారి

మసి పూసి.. మాయచేసి..

- లేని సంఘం ఉన్నట్లు సృష్టి
- స్త్రీశక్తి నిధులు రూ.14 లక్షల స్వాహా
- క్లస్టర్ కోఆర్డినేటర్ నిర్వాకం
- విచారణతో తిరిగి సొమ్మును రాబట్టిన అధికారులు

ఆత్రేయపురం: ఎవరికీ తెలియదని మసి పూసి.. మాయ చేశాడో ఉద్యోగి.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.14 లక్షల స్వాహా చేసి చివరికి దొరికిపోయాడు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుండగా, పలువురు ఉద్యోగులు వాటిని తమ జేబుల్లోకి వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల పేరవరం, బొబ్బర్లంక గ్రామాలకు చెందిన యానిమేటర్ దుర్గ సుమారు రూ.35 లక్షల మేర డ్వాక్రా నిధులు కాజేసిన ఘటన కలకలం సృష్టించింది. అది ఇంకా ఓ కొలిక్కి రాక ముందే ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో స్త్రీశక్తి పథకం క్లస్టర్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న దుర్గాప్రసాద్ రూ.14 లక్షల స్త్రీశక్తి నిధులు స్వాహా చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ముమ్మిడివరం స్త్రీశక్తి క్లస్టర్ కోఆర్డినేటర్, ఏపీఎంలకు తెలియకుండా వారి లాగిన్లు వినియోగించి ఆ నిధులు స్వాహా చేసినట్లు సమాచారం. మెర్లపాలెంలో వినియోగంలో లేని నాలుగు డ్వాక్రా సంఘాల పేరు మీద ఉన్నతాధికారులకు తెలియకుండా రూ.14 లక్షలు మంజూరు చేశారు. ఆ మొత్తాన్ని దుర్గాప్రసాద్‌కు చెందిన మూడు అకౌంట్‌లకు, అతని సోదరి పేరున బ్యాంక్ అకౌంట్‌కు రూ.3,75,000 చొప్పున నిధులు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నాడు. తీసుకున్న రుణానికి ఈ నెల వాయిదా సొమ్ము చెల్లించకపోవడంతో ఆ అవినీతి బాగోతం బహిర్గతమైంది. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ శివశంకర్‌ప్రసాద్ శనివారం ముమ్మిడివరం వెళ్లి స్త్రీ మేనేజర్, ఏపీఎం, క్లస్టర్ కోఆర్డినేటర్‌పై విచారణ నిర్వహించారు. ఈ విచారణలో నిధులు స్వాహా చేసినట్లు దుర్గాప్రసాద్ అంగీకరించడంతో స్వాహా చేసిన రూ.14 లక్షలు డీఆర్‌డీఏ ఏపీడీకి అందజేశారు. మోసానికి పాల్పడిన దుర్గాప్రసాద్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు నివేదిక పంపారు.

ఉదాసీనత వల్లే..

పేరవరంలో సుమారు రూ.35 లక్షల గోల్‌మాల్ చేసిన యానిమేటర్ దుర్గ వ్యవహారంలో అధికారుల ఉదాసీనత వల్లే తిరిగి ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ప్రజల సొమ్మును స్వాహా చేస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయనే భయం ఉంటే తిరిగి ఇంకొక ఉద్యోగి ఇలా చేయరని అంటున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని మెర్లపాలెంలో ఈ ఘటన జరిగిందని చెబుతున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో చేసేది లేక స్వాహా చేసిన సొమ్ము సదరు ఉద్యోగి వెనక్కి చెల్లిస్తున్నాడు. దీనిపై ఏపీఎం, ఇతర అధికారులకు 'సాక్షి' ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు. ఏపీడీ మాత్రం తమకు ఏమీ తెలియదని, నేరుగా ప్రాజెక్టు డైరెక్టర్‌ను అడగాలని తెలిపారు.



ఆత్రేయపురంలోని వెలుగు కార్యాలయం

నిధుల స్వాహా వాస్తవమే..

మెర్లపాలెంలో స్త్రీశక్తి నిధులను క్లస్టర్ కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ స్వాహా చేసిన విషయం వాస్తవమేనని పీడీ డాక్టర్ శివ శంకర్‌ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ సొమ్మును తిరిగి ప్రభుత్వానికి చెల్లిస్తున్నారని అన్నారు. దీనిపై కేసు కూడా నమోదు చేస్తామని వివరించారు. మొత్తం వ్యవహారంపై కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు. పేరవరం యానిమేటర్ విషయమై ఆయన స్పందిస్తూ.. ఇందులో పోలీసుల ఉదాసీనత కనిపిస్తుందన్నారు. ప్రస్తుతం యానిమేటర్ పరారీలో ఉన్నట్లు తెలిసిందన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

తాటిచెట్టు పడి వ్యక్తి మృతి



చొప్పెల్ల లంక భూముల్లో తాటిచెట్టు విరిగిపడి మృతి చెందిన సత్యనారాయణ

ఆలమూరు: జిల్లాలో పలుచోట్ల ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. చొప్పెల్లలో తాటిచెట్టు విరిగి పడి కౌలు రైతు దేగల సత్యనారాయణ (47) మృతి చెందగా, తిర్నాతి నాగుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. అక్కడి లంక భూముల్లో వంగ తోటకు క్రిమిసంహారక మందును వారిద్దరూ పిచికారీ చేస్తున్నారు. ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన వర్షం రావడంతో సమీపంలోని మోటార్ పాక వద్దకు వెళ్లారు. పక్కనే ఉన్న తాటిచెట్టు ఈదురు గాలులకు విరిగి పాకపై పడింది. దీంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందగా నాగుకు తీవ్ర గాయాలయ్యాయి. కౌలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సత్యనారాయణ మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. మృతుడి భార్య దుర్గ అంగన్‌వాడీ టీచర్ కాగా ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల పెద్దాపురంలోని ఓ కళాశాలలో పెద్ద కుమార్తె ఆత్మహత్య చేసుకుంది. ఆ షాక్ నుంచి కోలుకోక ముందే కుటుంబ పెద్ద మృతితో విషాదం నెలకొంది.

పిడుగు పాటుకు మరొకరు..

మండపేట: కేశవరంలో పిడుగు పడి ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికులు, రెవెన్యూ సిబ్బంది కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పురంశెట్టి లీలా శ్రీనివాస్ (23) శనివారం సాయంత్రం పొలంలో గేదెలను మేపుతున్నాడు. ఇంతలో ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో చెట్టు కిందకు వెళ్లాడు. ఈలోగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జయబాబుకు ఇద్దరు కుమారులు కాగా శ్రీనివాస్ మొదటి సంతానం. నిరుపేద కుటుంబం కావడంతో తండ్రితో పాటు ఇద్దరు కుమారులూ కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శ్రీనివాస్‌కు పెళ్లి చేద్దామనుకుంటున్న తరుణంలో ఇలా జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

దేశానికి మరిన్ని పతకాలు తేవాలి



బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్వికన్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, డీఆర్వో సత్తిబాబు

అమలాపురం టౌన్: తన బ్యాడ్మింటన్ క్రీడ ద్వారా అంతర్జాతీయంగా ప్రతిభ చూపుతూ దేశానికి మరిన్ని పతకాలు అందించాలని బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా అభినందించారు. గత నెల 30న దుబాయ్‌లో జరిగిన ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో తన జోడీ చిరాగ్ శెట్టితో కలసి డబుల్స్‌లో సత్తాచాటి భారత దేశానికి బంగారు పతకాన్ని అందించిన సాత్విక్ సాయిరాజ్‌ను స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ శనివారం ప్రత్యేకంగా సత్కరించారు. సాత్విక్‌తో పాటు అతని తండ్రి విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథ్‌ను కూడా కలెక్టర్ శుక్లా అభినందించారు. నేటితరం విద్యార్థులు, యువకులకు సాత్విక్ ఆదర్శంగా నిలుస్తున్నాడని అన్నారు. అతను మన జిల్లా వాసి కావడం మనకెంతో గర్వకారణమన్నారు. అనంతరం సాత్విక్‌కు కలెక్టర్ శుక్లా ఒక టోపీని బహుమతిగా అందించారు. అనంతరం సాత్విక్ సాయిరాజ్‌ను రెడ్‌క్రాస్ తరఫున ఘనంగా సత్కరించారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పీఎస్ శర్మ, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో 'తిరుమల' సువర్ణాధ్యాయం



పాలిసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో 11మంది 120/120 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకును సాధించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 14 మంది 119/120 మార్కులు సాధించారని, టాప్‌ఫిఫ్టీలో 25 ర్యాంకులను, టాప్ హండ్రెడ్‌లో 32 ర్యాంకులను సాధించారని తెలిపారు. పాల గేయ శ్రీసాయిహర్షిత్, అగ్గాల కృష్ణసాహిత్, ఉర్రింకల జితుకౌముది, కప్పల వెంకట రామవినీష్, దుద్దుపూడి రూపిక, శీలాగౌతమ్, కోటిపల్లి యశ్వంత్‌సాత్విక్, దువ్వి ఆశిష్‌సాయిశ్రీకర్, గ్రంధి గీతిక, వనపర్తి తేజశ్రీ, కొంజర్ల శంకర్‌మాణిక్‌లు రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకులను, కె.అభినవ్, పి.శరత్‌సంతోష్, కేవీఆర్ఎం. ఫణీంద్ర, కేఎస్ పాల్‌రెడ్డిలు రాష్ట్రస్థాయి 16వ ర్యాంకులను, కె.సాయిసృజన, ఎల్.దర్శన్, సీహెచ్ సాయి కేశవ్‌రామ్, టీబీ రుత్విక్‌రాజు, ఎల్.అభిషేక్, కె.యశ్వంత్‌రాజులు రాష్ట్రస్థాయి 25వ ర్యాంకులను, టి.సాహిత్, ఎస్ఎస్ఎస్ చంద్రహనుమాన్, కె.ప్రజీత్, డీకే రామ్.కిరీటీ రాష్ట్రస్థాయి 37వ ర్యాంకులను సాధించారని ఆయన తెలిపారు. ఈ విద్యార్థులను నున్న తిరుమలరావు, డైరెక్టర్ సరోజినిదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరిలు అభినందించారు.

'ఆదిత్య'కు అత్యుత్తమ ర్యాంకులు



ర్యాంకులు సాధించిన విద్యార్థుల బృందంతో చైర్మన్ శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ పాలిసెట్-23 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది మెరుగైన ర్యాంకులతో పాటు రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకు సాధించారన్నారు. గోనెల్ల శ్రీరామశశాంక్ 120కి 120 మార్కులు సాధించి ప్రథమ ర్యాంక్‌తో సత్తా చాటాడన్నారు. యర్రా లక్ష్మీకీర్తన 119 మార్కులతో 16వ ర్యాంక్, అందె శివకార్తీక్ 119 మార్కులతో 16వ ర్యాంక్, కంచర్ల సాయి శ్రీహిత్ 119 మార్కులతో 25వ ర్యాంక్, కొవ్వూరి ప్రసన్నకుమార్ 119 మార్కులతో 25వ ర్యాంక్, గొల్లపల్లి లోషిణి 119 మార్కులతో 37వ ర్యాంక్, కాకి అనన్య 119 మార్కులతో 37వ ర్యాంక్, తంగెళ్ల సాత్విక్ 119 మార్కులతో 37వ ర్యాంక్, ఎస్.లోహిత్‌కిరణ్ 118 మార్కులతో 51వ ర్యాంక్ సాధించారని తెలిపారు. వీరితో పాటు 100లోపు 16 ర్యాంకులు, 500లోపు 77 ర్యాంకులు, వెయ్యి లోపు 184 ర్యాంకులు పొందారన్నారు. స్థానిక శ్రీనగర్ ఆదిత్య అకాడమీలో విద్యార్థులను చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్ మొయినా, టి.రమేష్ అభినందించారు.

శశి వేలివెన్ను విద్యార్థుల ప్రభంజనం



వేలివెన్ను శశి క్యాంపస్‌లో విద్యార్థులతో చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్

ఉండ్రాజవరం: పాలిసెట్-2023 ఫలితాల్లో శశి వేలివెన్ను విద్యా సంస్థకు చెందిన ముగ్గురు విద్యార్థులు స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ శనివారం తెలిపారు. డీఎస్‌వీ శర్వన్, కె.ప్రకాష్, కె.మోహిత్ శ్రీరామ్ స్టేట్ 1వ ర్యాంకు, జి.అనూప్‌రాజ్, ఎల్.శ్రీకర్ కశ్యప్ 16వ ర్యాంకు, కేసీహెచ్ఎస్ సత్యదేవ్ 25వ ర్యాంకు, పీవైఎస్ సాయి సుందర్‌రెడ్డి, ఆర్.శ్రీరామాంజనేయులు, సీహెచ్ నాగసాహితి 37వ ర్యాంకు, ఎన్.నవ్యదేవిక 71వ ర్యాంకు, ఎస్.సందీప్ 87వ ర్యాంకు, ఎ.ప్రశాంత్ 98వ ర్యాంకు సాధించారన్నారు. 12వ సారి స్టేట్ ఫస్ట్ రావడం తమ విద్యాసంస్థకు గర్వకారణమని ఆయన తెలిపారు. ముగ్గురికి స్టేట్ ఫస్ట్ ర్యాంకులతో పాటు 50లోపు 9 మంది, 100లోపు 12 మంది ర్యాంకులు పొందారన్నారు. అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మిసుప్రియ అభినందించారు.